సాక్షి ఒడిశా
సోమవారం । 24 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.1,70,098లు, బంగారం 220 మిల్లీగ్రాములు, వెండి 10 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



చోరీ కేసులో నిందితుల అరెస్టు

రాయగడ జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పోలీసులు ఒక చోరీ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు.

- 8లో



ఆలయంలో దొంగతనం

జయపురం ప్రజల ఆరాధ్య దేవత మా భగవతి మందిరంలో శనివారం రాత్రి దొంగతనం జరిగింది.

- 8లో

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ట్రక్ టైర్ కింద పార్వతి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని డీఎన్‌కే కూడలి వద్ద ఆదివారం ఉదయం ఒక సైకిల్‌ను ట్రక్ ఢీకొనడంతో మహిళ దుర్మరణం చెందింది. వివరాల్లోకి వెళ్తే.. పార్వతి పాణిగ్రాహి అనే మహిళ సైకిల్‌పై డీఎన్‌కే వైపు ఒకరి ఇంట్లో పని చేసేందుకు రోజూ వెళ్తుంది. ఎప్పటిలాగే ఆదివారం కూడా తన కుమారుడిని తీసుకొని సైకిల్‌పై వెళ్తున్న సమయంలో అతివేగంగా వచ్చిన ఒక ట్రక్ సైకిల్‌ను బలంగా ఢీకొంది. దీంతో తల్లీ, కొడుకు కింద పడ్డారు. అయితే పార్వతీ ట్రక్ టైర్ కిందపడి పోవడంతో అక్కడికక్కడే మరణించింది. కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఐఐసీ రీగాన్‌కీండో సంఘటన స్థలానికి చేరుకొని ట్రక్ డ్రైవర్‌ను అరెస్టు చేసి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు ఆందోళనకు దిగారు. ట్రక్ ఓనర్‌తో మాట్లాడి పరిహారం ఇప్పిస్తామని ఐఐసీ హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నాటుసారా పట్టివేత



అరెస్టైన నిందితులను చూపిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ ఎక్సైజ్ సిబ్బంది ఆదివారం పలుచోట్ల దాడులు నిర్వహించి నాటుసారాతో పాటు సొలప కల్లు పట్టుకున్నారు. ఎక్సైజ్ సిబ్బందికి వచ్చిన ముందస్తు సమాచారంతో ముందుగా చంద్రపడ గ్రామ పరిసరాల్లో నాటుసారా బట్టీలపై దాడులు చేశారు. దీనిలో భాగంగా నాటుసారా తయారు చేస్తున్న చైతన్య బిశాయి అనే ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. అక్కట 30 లీటర్ల నాటుసారా పట్టుకున్నట్లు వెల్లడించారు. అలాగే మలిగుడ గ్రామ ప్రాంతంలో పెట్రోలింగ్ జరుపుతున్న సమయంలో ఒక ఆటోలో నాటుసారాతో పాటు సొలప కల్లు అమ్మేందుకు కొంతమంది తీసుకెళ్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ సిబ్బంది మాలిగుడ జంక్షన్ వద్ద మాటు వేశారు. ఆ మార్గంలో వస్తున్న ఆటోను ఆపి తనిఖీలు నిర్వహించగా, 30 లీటర్ల నాటుసారాతో పాటు 120 లీటర్ల సొలప కల్లు బయట పడింది. దీంతో ఆటోలో ఉన్న ముగ్గురిని అరెస్టు చేశారు. ఆ ముగ్గురిలో ఇద్దరు మహిళలున్నారు. అరెస్టైనవారు జుధిష్టర్ దొళాయి, మొణి పూజారి, గౌరి భూమియలు అని వెల్లడించారు.

రైలు ప్రయాణికులకు సముచిత సేవలు

- ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం పరమేశ్వర ఫుంకివాల్



పనులను పరిశీలిస్తున్న జీఎం పరమేశ్వర ఫుంకివాల్

జయపురం: రైలు ప్రయాణికులకు ఇక నుంచి సముచిత సౌకర్యాలు లభిస్తాయని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర ఫుంకివాల్ వెల్లడించారు. ప్రయాణికులు స్టేషన్‌కు వచ్చిన సమయం నుంచి రైలు ఎక్కేవరకు వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయన కొరాపుట్, జయపురం రైల్వేస్టేషన్లను ఆదివారం సందర్శించి రైల్వేస్టేషన్ల ఆధునీకరణ పనులను పరిశీలించారు. కేకే రైల్వేలైన్‌లో సమస్యలపై ముఖ్యంగా పలు సమయాల్లో మట్టి పెళ్లలు, కొండ చరియలు లైన్లపై పడటం వలన అసౌకర్యాలు ఏర్పడుతున్నాయని, అందువలన వాటిని నివారించేందుకు తగు చర్యలు చేపడతామన్నారు. రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులపై సంబంధిత అధికారులు జీఎంకు వివరించారు. ఆయనతో పాటు వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం సౌరభ ప్రసాద్, ఏడీఆర్‌ఎం సుధీర్ కుమార్ గుప్త తదితరులు ఉన్నారు.

అదిగో అదిగో... బ్రహ్మగిరి..!



పుష్పాలంకరణలో అలారనాథ స్వామి

- దేవస్నానంతో శ్రీజగన్నాథుడికి అస్వస్థత
- 15 రోజుల పాటు గోప్య సేవలు
- బ్రహ్మగిరిలో అలారనాథుడి దర్శనానికి పెరిగిన భక్తులు

భువనేశ్వర్: దేవస్నానం అనంతరం శ్రీమందిరంలో బలభద్రుడు, దేవీ సుభద్ర మరియు శ్రీజగన్నాథుని దర్శనం కనుమరుగైంది. 15 రోజుల పాటు మూల విరాటులు కనుమరుగున గోప్య సేవలు, ఉపచారాలు పొంది, పూర్తిగా కోలుకున్న తర్వాత భక్త జనం ముందు ప్రత్యక్షం అవుతారు. అంతవరకు పూరీ సమీపంలోని బ్రహ్మగిరి ప్రాంతంలో అలారనాథ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా తరలి వస్తారు. అలారనాథుని దర్శనం శ్రీజగన్నాథుని దర్శన ఫలాన్ని ప్రసాదిస్తుందని భక్తుల నమ్మకం.

● పూరీ నుంచి 23 కి.మీ దూరంలో...

పూరీ పట్టణానికి 23 కిలోమీటర్ల దూరంలో బ్రహ్మగిరి గ్రామం ఉంది. ఈ గ్రామంలో అలార్‌నాథ్ దేవస్థానం నెలకొని ఉంది. శ్రీజగన్నాథుని స్నానోత్సవం మర్నాటి నుంచి ఈ దేవస్థానానికి భక్తుల తాకిడి పుంజుకుంటుంది. ఈ వ్యవధిలో అలరనాథుని రూపంలో శ్రీజగన్నాథుడు కనిపిస్తాడని, అతని దర్శనం అదృష్టంతో శ్రేయస్సును ప్రసాదిస్తుందని నమ్మకంతో తీర్థయాత్రగా యాత్రికులు ఈ ప్రాంతానికి తరలివస్తారు. క్రీ.శ.1610లో తన అనుచరులతో కలిసి కృష్ణ ఆరాధన స్థాపకుడైన శ్రీచైతన్య దేవ్ ఇక్కడ విడిది చేసిన సమయంలో అలార్‌నాథ్‌లో జగన్నాథుని ప్రత్యక్ష దృశ్యమానం చేసినట్లుకూడా తన రచనలలో విపులంగా పేర్కొన్నట్లు చెబుతారు. అలారనాథ్ పీఠంలో డోల గోవిందుడు, నృసింహ, మదనమోహనుడు, రాముడు, కృష్ణుడు, భూదేవి, శ్రీదేవి, విష్ణువు 10 అవతారాల విగ్రహాలు కూడా పూజించబడుతున్నాయి. అలారనాథునికి పాయసం ప్రీతికర నైవేద్యం. గేదె పాలు, ఇతర పదార్థాలతో కలిపి తయారు చేయబడిన ఈ నైవేద్యం ఖీర్ భోగ్‌గా ప్రసిద్ధి. స్వామి దర్శనం తర్వాత భక్తులకు ఈ ప్రసాదం లభిస్తుంది.

● ప్రచారంలో పౌరాణిక కథనాలు

బ్రహ్మ దేవుడు ఈ ప్రదేశానికి వచ్చి విష్ణువును పూజించాడు. అతని భక్తికి సంతోషించిన శ్రీమహావిష్ణువు చతుర్భుజాలతో కూడిన నల్ల రాతి ప్రతిమని ప్రతిష్టించమని కోరాడు. స్వామి కోరిక మేరకు బ్రహ్మ దేవుడు శంఖం, చక్రం, గద మరియు పద్మాన్ని ధరించిన చతుర్భుజ నల్లరాతి మహా విష్ణువు విగ్రహాన్ని ప్రతిష్టించినట్లు పౌరాణిక కథనం ప్రచారంలో ఉంది. బ్రహ్మ ఈ కొండ ప్రాంతంలో పూజించినందున ఈ ప్రాంతానికి బ్రహ్మగిరి అని పేరు వచ్చింది.

● ఆళ్వార్ హయాంలో..

ఈ ఆలయాన్ని రాజస్థాన్ ఆళ్వార్ పాలకులు నిర్మించినట్లు చారిత్రాత్మక కథనం. అందుకే దీనికి ఆళ్వార్ నాథ్‌గా పేర్కొంటారు. వాడుకలో కాలానుక్రమంగా అలార్‌నాథ్‌గా పేరొచ్చింది. నిత్య పూజాదులతో భక్తులకు దర్శనం ఇస్తున్నాడు. క్రీ.శ.1610లో చైతన్య మహాప్రభు పూరీని సందర్శించారు. ఆయన సందర్శన సమయంలో తోబుట్టువులతో శ్రీ జగన్నాథుడు అనారోగ్యంతో కనుమరుగున చికిత్స పొందుతుండడంతో స్వామి దర్శనం లభించదు.

దీంతో చైతన్య మహా ప్రభువుకి స్వామి స్వప్నంలో సాక్షాత్కరించి బ్రహ్మగిరి వైపు పయనం మళ్లించాడు. ఆ ప్రాంతంలో కొలువుదీరిన అలార్ నాథునిలో చైతన్య మహా ప్రభువుకు సాక్షాత్తు శ్రీ జగన్నాథ స్వామి దర్శనం లభించినట్లు చెబుతారు. చైతన్య మహాప్రభువు ఈ దేవస్థానం సందర్శించినట్లు శిలా రూప ఆనవాలు ఉన్నాయి. స్వామి స్వప్న ఆదేశం మేరకు అలార్‌నాథుని రూపంలో జగన్నాథుడిని దర్శించిన చైతన్య మహా ప్రభువు సాష్టాంగ ప్రణామం చేయడంతో, కింద ఉన్న రాయి ఆయన ఆకృతిలో కరిగిపోయింది. చైతన్య మహాప్రభు యొక్క సాష్టాంగ ప్రణామం శరీర ముద్రలతో ఏర్పడిన శిలా రూపం నేటికీ దర్శనం ఇస్తుంది.

ఏఐసీసీ చైర్మన్ మల్లికార్జున్ ఖర్గేతో భేటీ



మల్లికార్జున్ ఖర్గేతో కాంగ్రెస్ నాయకులు

కొరాపుట్/రాయగడ: రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కలు న్యూఢిల్లీలో ఏఐసీసీ చైర్మన్ మల్లికార్జున్ ఖర్గేను ఆదివారం కలిశారు. ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ శాసనసభ పక్ష నేత ఎంపిక వ్యవహారం ఆ పార్టీలో కొలిక్కి రాలేదు. జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ఈ పదవి కోసం పోటీలో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. మరోపక్క ఎంపీ ఉల్క కూడా మరో అభ్యర్థిని రంగంలో ఉంచారని పార్టీ కార్యకర్తలు అనుకుంటున్నారు. గెలిచిన వెంటనే బాహిణీపతి న్యూఢిల్లీ వెళ్లి ఖర్గేని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ నేపథ్యంలో ఉల్కతో వెళ్లి మరికొందరు కలుసుకున్నారు. ఉల్కతో కొరాపుట్ జిల్లా పొట్టంగి ఎమ్మెల్యే రాం చంద్ర ఖడం, రాయగడ జిల్లా గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజిత్ గమాంగ్, కలహండి జిల్లా భవానీపట్న ఎమ్మెల్యే సాగర్ దాస్, మోహన ఎమ్మెల్యే దాశరథి గమాంగ్, బిసంకటక్ ఎమ్మెల్యే నీల మాధవ హిక్కా, చిత్రకొండ ఎమ్మెల్యే మంగు కిలోలు ఉన్నారు. ప్రస్తుత భేటీ రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ కలిగించింది.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



నరేష్ మృతదేహం

రాయగడ: విద్యుత్ షాక్‌తో ఒక యువకుడు మృతి చెందిన ఘటన జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి మజ్జిగుడ పంచాయతీలోని పొమడ గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి నరేష్ నమక (28)గా గుర్తించారు. తన ఇంటిలో విద్యుత్ లేకపోవడంతో ఇంటి మీదకు వెళ్లి విద్యుత్ తీగను కదుపుతున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. దీంతో వెంటనే సమీపంలోని ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్లు స్పష్టం చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బీడీ ఆకుల అమ్మకానికి అనుమతివ్వాలని వినతి



సీఎం మోహన్ చరణ్ మాఝీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జయపురం: బీడీ ఆకులను అమ్ముకునేందుకు అనుమతి ఇవ్వాలని జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ గ్రామసభ మహాసంఘ నేతలు కోరారు. ఈ మేరకు సీఎం మోహన్ చరణ్ మఝీని భువనేశ్వర్‌లో శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. కొరాపుట్ జిల్లా ఆదివాసీ ప్రజల ప్రధాన అటవీ ఉత్పత్తి బీడీ(ఖెందు పత్ర) ఆకులకు ప్రభుత్వం మద్దతు ధర లేకపోవడం వలన తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. వేసవిలో ఆదివాసీ ప్రజలు ముఖ్యంగా మహిళలు, పిల్లలు బీడీ ఆకులు సేకరించి ఎండలో ఆరబెట్టి అమ్ముతారని, అయితే నేటికీ బొయిపరిగుడ, కుంద్ర సమితిల ప్రాంతంలో ఆదివాసీ ప్రజల నుంచి మహాసంఘం ఖరీదు చేసిన రూ.60 లక్షలు విలువైన బీడీ ఆకులు పడి ఉన్నాయని వినతిపత్రంలో వివరించారు. వాటిని అమ్మేందుకు 10 రోజులు మాత్రమే సమయం ఉందని, అందువలన గ్రామసభ మహాసంఘం సమస్యలు ఎదుర్కొంటోందని వివరించారు. తాము కొన్న బీడీ ఆకులను ప్రభుత్వం ఖరీదు చేయాలని సంబంధిత జిల్లా అధికారులకు, జయపురం, కొరాపుట్, జయపురం ఎస్‌డీఎల్‌పీ, కొరాపుట్ డీఎల్‌పీకి ఇదివరకే విజ్ఞప్తి చేశామన్నారు. అలాగే మే నెలలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అటవీ విభాగ కార్యదర్శి, ఆదివాసీ విభాగ కార్యదర్శి మొదలగు అధికారులను కలిసి బీడీ ఆకులు అమ్మేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు అనుమతి లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిని కలిసినవారిలో మహాసంఘ అధ్యక్షుడు ధనపతి ఖిలో, కార్యదర్శి సుక్ర కిరసాని, సభ్యులు హీరామణి పూజారి, మాలతీ నాయిక్, భక్త మఝి తదితరులు ఉన్నారు.

నబరంగ్‌పూర్‌లో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని చైనా మార్కెట్‌లో ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా విజయనగరంలోని శ్రీసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి చెందిన వైద్యులు డి.కిషోర్, మాధురి సాయి, చరణ్‌లు రోగులకు పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులు ఉన్నత వైద్యం కోసం తమ ఆస్పత్రికి వస్తే ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. సుమారు వందకు పైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళింగ వైశ్య సంఘం, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

22 జిల్లాల్లో వర్షాభావం



భువనేశ్వర్: నైరుతి రుతుపవనాలు ముందుగానే రాష్ట్రంలోకి ప్రవేశించినా 22 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదు అయింది. ఈనెల ఆరంభం నుంచి 22వ తేదీ వరకు రాష్ట్రంలో సగటున సాధారణ వర్షపాతం కంటే 39 శాతం లోటు వర్షపాతం నమోదు అయినట్లు స్థానిక వాతావరణ కేంద్రం తెలిపింది. 17 జిల్లాల్లో సాధారణ లోటు నమోదు కాగా, మరో 5 జిల్లాల్లో తీవ్ర లోటు వర్షపాతం రికార్డు అయినట్లు ఈ కేంద్రం సమాచారం. భద్రక్, కేంద్రాపడా, జాజ్‌పూర్, సుందర్‌గఢ్, దేవ్‌గఢ్, అంగుల్, ఝార్సుగుడ, బర్‌గఢ్, సోన్‌పూర్, బౌధ్, ఖుర్దా, నయాగఢ్, గంజాం, గజపతి, రాయగడ, కలహండి, కొరాపుట్ వంటి 17 జిల్లాల్లో జూన్ 1 నుంచి జూన్ 22 వరకు సామాన్య లోటు వర్షపాతం నమోదు అయింది. మరో వైపు మయూర్‌భంజ్, బాలాసోర్, కెంజొహార్, పూరి మరియు బొలంగీర్‌తో సహా ఐదు జిల్లాల్లో ఈ వ్యవధిలో భారీ లోటు వర్షపాతం నమోదైందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. జగత్‌సింగ్‌పూర్, కటక్, ఢెంకనాల్, సంబల్‌పూర్, కంధమల్, నువాపడా, నవరంగ్‌పూర్, మల్కన్‌గిరి ఎనిమిది జిల్లాలు మాత్రమే సాధారణ వర్షపాతాన్ని చవి చూశాయి. ఈ ఏడాది రుతు పవనాల తాకిడి కలిసి రాలేదు. తొలి నుంచి వర్షపాతం నిరుత్సాహకరంగా కొనసాగింది. సీజన్ ఆరంభమై 22 రోజులు ముగిసే సరికి రాష్ట్రంలో 39 శాతం వర్షపాతం లోటు కొనసాగుతోంది. జూన్ 1 నుంచి 22 వరకు రాష్ట్రంలో నామమాత్రంగా 83.6 మిల్లీమీటర్ల వాస్తవ వర్షపాతం నమోదు కావడంతో 39 శాతం లోటు వర్షపాతం ఖరారు అయింది. ఈ పరిస్థితి ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. రాష్ట్రంలో రుతుపవనాల మందగమనం కారణంగా చాలా తక్కువ వర్షపాతం నమోదైంది.

వరదల నియంత్రణపై అప్రమత్తత



వరదలపై సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం


- సీఎం మోహన్ చరణ్ మాఝీ

భువనేశ్వర్: వర్షాకాలం నేపథ్యంలో వరదల నియంత్రణపై అనుబంధ యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ అధికారులను ఆదేశించారు. ఆదివారం జరిగిన జల వనరుల శాఖ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన రాత్రింబవళ్లు కంట్రోల్ రూమ్‌ను తెరిచి, వరదల సమర్థ నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సూచించారు. సమావేశం అనంతరం అభివృద్ధి కమిషనర్, జల వనరుల శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి అనూగర్గ్ మీడియాతో మాట్లాడుతూ నదుల కట్టలను పటిష్టం చేయాలని, బలహీన, దుర్బల ప్రాంతాలపై దృష్టి సారించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారన్నారు. వరదలకు సంబంధించి జల వనరుల శాఖ చేపట్టిన పలు చర్యలను ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిపారు. ఇప్పటికే వివిధ ఆనకట్టల వద్ద గేట్లను తెరవడంపై మాక్ డ్రిల్స్ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ విభాగం ఇంజనీర్లు మరియు స్థానిక తహసీల్దార్లు ఏమైన పగుళ్లను గుర్తించడం కోసం ఎప్పటికప్పుడు కట్టలను తనిఖీ చేస్తుంటారని వెల్లడించారు. తద్వారా అత్యవసర మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని వివరించారు. భారీ ఎత్తిపోతల సాగు, లఘు ఎత్తిపోతల సాగు, డీప్ బోర్‌వెల్ సహా అన్ని ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని మోహన్ చరణ్ మాఝీ శాఖ అధికారులను ఆదేశించారు. వరదల సమర్థవంతమైన నిర్వహణ కోసం ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందించనున్నందున, ముసాయిదా పాలసీ వివరాలను సిద్ధం చేయాలని ఆదేశించినట్లు సమాచారం.


ప్రారంభమైన చిత్రపటాల దర్శనం



అనంత వాసుదేవుడు



భువనేశ్వరి/యజ్ఞ సేని



అనంత నారాయణుడు

- శ్రీజగన్నాథుడి అస్వస్థత నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు

భువనేశ్వర్: భారీ స్నానం ప్రభావంతో శ్రీజగన్నాథుడు అస్వస్థతకు గురైనట్లు భావిస్తారు. చీకటి మండపంలో గోప్యంగా చికిత్స, వైద్య ఉపచారాలు చేపడతారు. దైతపతులు, రాజ వైద్యులు ప్రత్యక్షంగా స్వామివారికి ఈ సేవలు చేస్తారు. పక్షం రోజుల పాటు నిరవధికంగా వైద్య ఉపచారాలు పొందిన స్వామివారు క్రమంగా కోలుకుంటారు. అంతవరకు ఎవరి కంట పడకుండా చీకటి ప్రాంగణంలో విశ్రమిస్తాడు. దీంతో రత్న వేదిక బోసి బోతుంది. ఈ వ్యవధిని అనవసర కాలంగా పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో భగవంతుడు ఆసీనుడైన మండపం అనవసర మండపంగా పేర్కొంటారు.

భక్తుల కోసం ఏర్పాటు

ఈ సమయంలో భక్తుల కోసం రత్న వేదిక ప్రాంగణంలో చిత్రపటాల దర్శనం లభిస్తుంది. మూల విరాటులకు బదులుగా సంప్రదాయ రీతిలో తయారు చేసిన పట్టాలపై చిత్రించిన దేవతామూర్తుల దర్శనం లభిస్తుంది. వీటిని అనవసర దేవతలుగా వ్యవహరిస్తారు. అనవసర కాలంలో బలభద్ర స్వామికి బదులుగా అనంత వాసుదేవుడు, యజ్ఞసేని లేదా భువనేశ్వరిగా దేవీ సుభద్ర, అనంత నారాయణుడిని శ్రీజగన్నాథుని ప్రతిరూపంగా భావించి పూజిస్తారు. చిత్రకారులు, రూపకారుల సేవాయత్ వర్గం వంశపారంపర్యంగా ఈ చిత్రాలను చిత్రీకరిస్తారు. ఏటా సరికొత్తగా చిత్రపటాలను చిత్రించి భక్తుల దర్శనం కోసం ఏర్పాటు చేస్తారు. అలవాటులో పొరపాటుగా స్వామి దర్శనం కోసం శ్రీమందిరానికి విచ్చేసే భక్తుడు, యాత్రికుడు నిరుత్సాహపడకుండా మూల విరాటుల ప్రతిరూపాలుగా చిత్రపటాల్లో అనంత వాసుదేవుడు, భువనేశ్వరి, అనంత నారాయణుడు దర్శనం ఇవ్వడం విశేషం.

క్లుప్తంగా

శ్మశానవాటికలో శ్రమదానం



శ్రమదానం చేస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ఇంద్రావతి నది ఒడ్డున ఉన్న శ్మశానవాటికలో పట్టణానికి చెందిన ఐకాన్ ఇన్ మోషన్స్ అనే యువ స్వచ్ఛంద సేవా సంస్థ ఆదివారం శ్రమదానం నిర్వహించింది. విషయం తెలుసుకున్న నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి తన అనుచరులతో అక్కడి చేరుకున్నారు. యువత చేస్తున్న పనిని అభినందించారు. తాను కూడా శ్రమదానంలో పాలుపంచుకున్నారు. దీంతో ఆయనను అందరూ అభినందించారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు



ఎంపికైన క్రీడాకారులతో చెస్ సంఘ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి అండర్-19 బాలబాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. శ్రీకాకుళం నగరంలోని నానుబాల వీధిలో గల చెస్ శిక్షణా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-19 చెస్ ఎంపిక పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకున్నారు. రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యేందుకు తమ మెదడుకు పనిచెప్పారు. ఎత్తుకు పైఎత్తులేశారు. ఈ పోటీల్లో వై.సేతుమాధవ్, బగ్గు అభినవ్, జీవన్, రిత్విక్‌సాయి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా కార్యదర్శి జామి రమేష్ తెలిపారు. వీరంతా వచ్చేనెల 18వ తేదీ నుంచి నంద్యాలలో జరగబోయే రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులకు ఏపీ రాష్ట్ర చెస్ సంఘ కార్యదర్శి సనపల భీమారావు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి వైఎస్‌వీ కుమార్, అసోసియేషన్ సభ్యులు అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

'శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం'



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలను దేశం మరువలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం శ్రీకాకుళం నగరంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం అని కశ్మీర్ వెళ్లడానికి ఆంక్షలు ఏమిటని ప్రశ్నించిన మొదటి వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారని, దేశ ఐక్యత కోసం ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. జూన్ 23 మొదలుకుని జూలై 6న తేదీన శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వరకు చెట్లు నాటే కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నాడ సంజీవరావు, కోరాడ అప్పలరాజు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పేడాడ సూర్యకుమారి, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, బూత్ అధ్యక్షుడు నల్లాన ప్రసాద్, విజయకుమార్, మురళీరాజు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు వద్దంటూ..



కాశీబుగ్గలో మాదకద్రవ్యాలతో నష్టమనే షార్ట్‌ఫిల్మ్ షూటింగ్‌లో ఓ సన్నివేశం

కాశీబుగ్గ: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలనే ఇతివృత్తంతో ఓ షార్ట్‌ఫిల్మ్‌ను చిత్రీకరిస్తున్నారు. సంబంధిత షూటింగ్ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఆదివారం జరిగింది. కాశీబుగ్గ నుంచి అక్కుపల్లి వెళ్లే రోడ్డులో నటీనటులతో సన్నివేశాలు తీశారు. రామానాయుడు స్టూడియోలో దర్శకునిగా కోర్సు పూర్తి చేసుకున్న వజ్రపుకొత్తూరు మండలం గల్లి గ్రామానికి సంపతిరావు హేమసుందర్ దర్శకత్వంలో, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ నిర్మాతగా ఈ లఘుచిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ నెల 26వ తేదీన శ్రీకాకుళం పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరగనున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో ప్రదర్శించనున్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు



పోలీసులకు చిక్కిన నిందితులు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పోలీసులు ఒక చోరీ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో నవరంగపూర్ జిల్లాలోని కెందుగుడ గ్రామానికి చెందిన ధనపతి హిరజన్, దైతారి చలాన్, పాల సంత, కలహండి జిల్లాకు చెందిన దాససంతలు ఉన్నారు. వీరి నుంచి 18 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు, మరో నాటు తుపాకీ, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని నిందితులను కోర్టుకు తరలించారు. ఆదివారం టికిరి పోలీసుస్టేషన్ ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను పోలీసులు వెల్లడించారు. ఈనెల 15వ తేదీన నయాఘడ్ జిల్లాకు చెందిన ఒజిర్ అహ్మద్ అనే వ్యక్తి టికిరి పోలీసుస్టేషన్ పరిధిలోని పహండి కూడలిలో ఒక ట్రాక్టర్ వద్ద నీలగిరి కర్రల లోడింగ్ కోసం ఎదురు చూస్తున్న



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న తుపాకీ, కత్తులు, సెల్‌ఫోన్లు

సమయంలో, గుర్తు తెలియని నలుగురు దుండగులు అతనిని కత్తి, పిస్తోల్‌తో బెదిరించారు. తమకు వెంటనే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే అతని వద్ద నగదు లేదని చెప్పగా బాధితుని వద్దనున్న సెల్‌ఫోన్ లాక్కొని ఫోన్ పే లాక్ ఓపెన్ చేయించి రూ.22 వేలు మరో నంబర్‌కు పంపించి వెళ్లిపోయారు. దీనిపై బాధితుడు టికిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ మేరకు దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్నారు.

ఆలయంలో దొంగతనం





సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్న పోలీసులు



మా భగవతీ మందిరం (ఇన్‌సెట్లో) చిందరవందరంగా పడిన మా భగవతి ఆభరణాలు, దుస్తులు

జయపురం: స్థానిక ప్రజల ఆరాధ్య దేవత మా భగవతి మందిరంలో శనివారం రాత్రి దొంగతనం జరిగింది. ఆదివారం ఉదయం మందిరానికి వచ్చిన పూజారి ఆలయంలో దొంగతనం జరిగిందని గుర్తించి వెంటనే పరిచాలన కమిటీ వారికి తెలియజేయగా, వారు జయపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మందిరం వద్దకు వచ్చి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగలు ఎలా వచ్చారు అన్న దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దొంగలు ఆలయం వెనుక వైపు ద్వారం నుంచి లోనికి ప్రవేశించినట్లు అనుమానిస్తున్నారు. ఆలయంలో అమ్మవారం నగలు, వస్త్రాలు చిందరవందరంగా పడి ఉన్నాయి. అయితే ఆలయంలో దొంగలు ఏం దొంగిలించారో ఇంతవరకు స్పష్టం కాలేదు.

రాష్ట్రమంతటా నైరుతి రుతు పవనాలు



భువనేశ్వర్: నైరుతి రుతు పవనాలు రాష్ట్రమంతటా వ్యాపించాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆదివారం తెలిపింది. ఈ సంస్థ సమాచారం ప్రకారం ఈనెల 26 వరకు రాష్ట్రంలో ఉరుములు, ఈదురు గాలితో కూడిన వర్షం వాతావరణం నెలకొంటుంది. జూన్ 27 తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక జారీ చేసింది. రానున్న 24 గంటల్లో నగరంలో ఒకటి లేదా రెండు సార్లు ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది.

నేటి వాతావరణం

బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా, నయాగడ్, గంజాం, గజపతి, మయూర్‌భంజ్, కెంజొహర్, అంగుల్, బౌద్, ఢెంకనాల్, కంధమల్, రాయగడ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో ఉపరితల గాలులు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కూడా పడే అవకాశం ఉంది.

రేపటి వాతావరణం

ఝార్సుగుడ, సుందర్‌గడ్, కెంజొహర్, మయూర్‌భంజ్, అంగుల్, ఢెంకనాల్, కంధమాల్, రాయగడ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు ఉపరితల గాలులు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, ఉరుములతో కూడిన వర్షం కూడా కురుస్తుంది.

ముగిసిన మొదటి విడత ఐటీఐ కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు నిర్వహించిన మొదటి విడత కౌన్సెలింగ్ ముగిసింది. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 18 నుంచి ఆదివారం వరకు ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. చివరి రోజు 2304 ర్యాంకు నుంచి 2470 ర్యాంకు వరకు ప్రవేశాలు నిర్వహించగా, 165 మందికి 73 మంది హాజరయ్యారు. 34 మంది ప్రవేశాలు పొందారు. మొత్తం కౌన్సెలింగ్‌లో 634 మంది ప్రవేశాలు పొందారు. జిల్లాలోని 23 ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 3608 సీట్లు ఉండగా, 2974 సీట్లు మిగిలిపోయాయి. దరఖాస్తు చేసి హాజరై సీట్లు రానివారు, హాజరు కాని వారికోసం ఈ నెల 25, 26 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ప్రాధాన్యత గల ట్రేడుల్లో ప్రత్యేక రిజర్వేషన్లతో తప్ప, మిగతా సీట్లు నిండిపోయాయి. ప్రైవేట్ ఐటీఐల్లో తక్కువగా ప్రవేశాలు జరిగాయి. రెండో విడత కౌన్సెలింగ్‌లో ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలు జరిగే అవకాశం ఉంది. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రవేశాల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు, ప్లేస్‌మెంట్ అధికారి కామేశ్వరరావు పర్యవేక్షించారు.

'117 జీఓను రద్దు చేయాలి'



హరిపురంలో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ

కాశీబుగ్గ: గత ప్రభుత్వ కాలంలో విలీనం చేసిన 3,4,5 తరగతులను యథావిధిగా కొనసాగించాల ని మందస మండలం హరిపురం ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఏపీటీఎఫ్ విద్యా సదస్సు లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ కోరారు. ప్రస్తుత ప్రభుత్వం ఇంతకు ముందు ఇచ్చిన హామీ మేరకు 117 జీఓను రద్దు చేయాలని కోరారు. ఉదయం పూట జరిగిన విద్యా సదస్సులో విద్యారంగం కొత్త ప్రభుత్వం కొత్త ఆశలు అనే అంశంపై భానుమూర్తి ప్రధాన వక్తగా మాట్లాడారు. నేడు ఉ పాధ్యాయులు పాఠశాలలో స్వేచ్ఛగా పని చేసే పరిస్థితి లేదని, ఉపాధ్యాయులను బోధనేతర పను ల నుంచి తప్పించాలని అదే విధంగా ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని కోరారు. అనంతరం వీవీ వరప్రసాద్ సేవలను గుర్తు చేసుకుంటూ ఆయనను అభినందించారు. కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు జి. ఉమారాజ్, పీఎంసీ చైర్ పర్సన్, వి.కళ, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం.మదన్ మోహన్, ఎస్వీ అనిల్‌కుమార్, జిల్లా సబ్ కమిటీ సభ్యులు జి.భీమారావు, రామ్మోహన్, సీహెచ్ శ్రీనివాస్, బి.ఢిల్లీశ్వరరావు, కె.గోపీకృష్ణ, ఎస్.చాణక్య, జి.రాజేష్, పి.తిరుమలరావు, మందస ఎపిటియఫ్ అధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి యస్ కిరణ్‌కుమార్, కె.సుందరరావు, మందస మండల కార్యవర్గ సభ్యులు డి.చంద్రశేఖర్, ఎన్.కరుణాకర్, కె.జగదీశ్వరరావు, కె.చిరంజీవి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు



స్వామివారి విగ్రహాలను తీసుకొస్తున్న కమిటీ సభ్యులు



స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయ 43వ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శంకరీ గణపతి, కార్యదర్శి లాడి సురేష్, కోశాధికారి మాలా లక్ష్మణమూర్తి, ఉపాధ్యక్షుడు సుమన్ పాత్రో తదితరుల నేతృత్వంతో వేడుకలు నిర్వహించారు. ముందుగా సుప్రభాత సేవ, విశేష పూజలు, కుంకుమ అర్చనలతో పాటు సామూహిక వ్రత కార్యక్రమాలు జరిగాయి.

● నిప్పు కణికల మధ్య కాళిక



కాళీమాత వేషధారణతో అగ్ని గుండం మధ్య నృత్యం చేస్తున్న కళాకారుడు

ధనరాజుల తులసమ్మ ఉత్సవంలో కాళికామాత వేషధారి అదరగొట్టారు. అగ్ని గుండం మధ్య నృత్యం చేస్తూ భక్తులను అబ్బురపరిచారు. లొద్దపుట్టిలో జరిగిన ఈ ఉత్సవాన్ని తిలకించి భక్తులు తన్మయత్వం పొందారు.

\- ఇచ్ఛాపురం రూరల్



ధనరాజులమ్మ తులసమ్మ ఆలయం వద్ద కోయనృత్యం చేస్తున్న కళాకారులు

మహిళలందరికీ సుభద్ర యోజన

● డిప్యూటీ సీఎం ప్రభాతి పరిదా

భువనేశ్వర్: రాష్ట్రంలోని తొలి భారతీయ జనతా పార్టీ సర్కార్ సంకల్పించిన సుభద్ర యోజన పథకంలో రాష్ట్రంలోని మహిళలందరినీ కలుపుకుపోతామని ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిదా ఆదివారం తెలిపారు. ఈ పథకానికి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ముసాయిదా దశలో ఉంది. ముసాయిదా ప్రక్రియ పూర్తయిన తర్వాత 100 రోజుల్లో ఈ పథకం అమల్లోకి వస్తుంది. రాష్ట్రంలోని మహిళలందరూ ఈ పథకం కింద లబ్ధిదారులుగా ఉంటారని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడుతూ పథకం అమలుపై స్పష్టత ఇచ్చారు. సుభద్ర యోజన కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి ఆర్థిక సాయం కోరింది. శనివారం ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్ లిఖితపూర్వక మెమోరాండమ్‌లో పథకం అమలు కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి పాక్షిక మద్దతు కోరారని ఆమె తెలిపారు. సుభద్ర యోజన మహిళల సంక్షేమాన్ని ప్రోత్సహించడం, వ్యవస్థాపకత ద్వారా గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి అవకాశం కల్పించడం లక్ష్యంగా పని చేస్తుందని వివరించారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని ప్రతీ మహిళకు రూ.50,000 వోచర్ అందజేస్తారు. వోచర్ పొందిన తేదీ నుంచి 2 ఏళ్ల లోపు దాన్ని నగదుగా మలచుకునేందుకు వీలు కల్పిస్తారు. మహిళలకు సాధికారత కల్పించడంతో పాటు మహిళల్లో వ్యవస్థాపకతను పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన వినూత్న కార్యక్రమంగా ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

పరిశీలనలో ఉన్న పథకం అర్హతలు

- దరఖాస్తుదారు తప్పనిసరిగా ఒడిశా రాష్ట్రానికి చెందినవారై ఉండాలి.
- వివాహిత మహిళలు మాత్రమే అర్హులు.
- ఒక కుటుంబం నుంచి ఒక మహిళ మాత్రమే ఈ పథకానికి దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.
- దరఖాస్తుదారు తప్పనిసరిగా 23 నుంచి 59 సంవత్సరాల వయస్సులో ఉండాలి.
- మహిళా దరఖాస్తుదారు తప్పనిసరిగా ఒడిశా రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగి కాకూడదు.
- ఈ విధానంలో ప్రయోజనాలు అంగన్‌వాడీ కార్యకర్తలకు వర్తిస్తాయి.

అటవీ భూమి మళ్లింపు ప్రక్రియ నిలిపివేత

భువనేశ్వర్: స్థానిక కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ (కిస్)కు అటవీ భూముల మళ్లింపు ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన స్పష్టత వచ్చే వరకు నిలిపి వేయాలని కేంద్ర ప్రభుత్వం ఖుర్దా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. ఖుర్దా జిల్లా కలెక్టర్‌కు రాసిన లేఖలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జుయల్ ఓరం ఈ ప్రక్రియను నిలిపివేయాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం 4.032 హెక్టార్ల ప్రభుత్వ రెవెన్యూ అటవీ భూమిని ఖుర్దా జిల్లాలో కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్(కిస్)కి అప్పగించే ప్రక్రియను ప్రారంభించిందని పేర్కొన్నారు. చందక వన్యప్రాణి విభాగం పరిధిలోని అటవీ భూమిని గిరిజన విద్యార్థులకు సౌకర్యాలు, విద్యాభివృద్ధికి కిస్‌కు అనుకూలంగా మళ్లించాల్సి ఉంది. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖలో అవసరమైన స్పష్టత వచ్చే వరకు ఈ విషయంలో అధికారిక క్లియరెన్స్ జారీ ప్రక్రియను నిలిపివేయాలని లేఖలో పేర్కొన్నారు. అటవీ భూమి మళ్లింపు ప్రతిపాదన ప్రక్రియ పురస్కరించుకుని అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్‌ఏ) నిబంధనల అమలు, కార్యాచరణపై ఫిర్యాదులు అందడంతో గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ చర్య తీసుకుంది. ఈ విషయంలో గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒడిశా ప్రభుత్వం నుంచి ప్రత్యేక వివరణలు కోరింది.

హోంగార్డు వసూళ్లు వీడియో వైరల్



హోంగార్డు డబ్బులు అడుగుతున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్న డ్రైవర్

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి పోలీసుస్టేషన్‌లో హోంగార్డ్‌గా పనిచేస్తున్న క్షిరోద్ మిస్త్రీ ప్రతిరోజూ విధుల్లో ఉన్న సమయంలో అటుగా వస్తున్న ట్రక్ డ్రైవర్ల నుంచి డబ్బులు తీసుకుంటున్న వీడియో ఆదివారం వైరల్ అయ్యింది. ప్రతిరోజు మాదిరిగానే ఒక డ్రైవర్‌ను డబ్బులు ఇవ్వమని అడడగా అతను ఇవ్వనన్నాడు. దీంతో ట్రక్‌లో సరుకులు దించమని హోం గార్డు బెదిరించాడు. సరుకు దింపుకొని చెక్ చేసుకోమని డ్రైవర్ అన్నాడు. దీంతో అక్కడ ఉన్నవారు వీడియో తీసి వైరల్ చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్ మాట్లాడుతూ.. తనకు ప్రతిసారి రెండు వందలు చొప్పున అడుగుతున్నట్లు తెలిపారు. కాగా వీడియో తీసున్న వ్యక్తిని హోంగార్డు అసభ్యంగా తిట్టాడు. ఈ విషయం కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండ దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన మాట్లాడుతూ.. ఘటనపై విచారణ చేసి, డబ్బులు వసూలు చేస్తున్నట్లు తేలితే చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం



సన్మానం పొందిన విద్యార్థులు

రాయగడ: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) గుణుపూర్ శాఖ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల ప్రాంగణంలో ఉత్తమ విద్యార్థులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ప్రకటించిన పది, 12 తరగతుల ఫలితాల్లో ఉత్తమ మార్కులను సాధించిన 75 మంది విద్యార్థులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు సంక్షేమ శాఖ అధికారి సూరజ్ నాయక్, గౌరవ అతిథిగా వ్యవసాయ శాఖ అధికారి (గుణుపూర్ డివిజన్) సంతోష్ రౌథొ తదితరులు హాజరయ్యారు. విద్యార్థులు తమ భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని, అందుకు పట్టుదలతో పాటు ఏకాగ్రతతో చదవాలని వక్తలు ప్రసంగించారు. ఏబీవీపీ గుణుపూర్ శాఖ అధ్యక్షురాలు లక్ష్మీ హమాం కుడొ, సభ్యులు డాక్టర్ ప్రశాంత్ హత, కార్యదర్శి సాయి పాణిగ్రాహి విద్యార్థులను అభినందించారు.

వైభవంగా పాలధారోత్సవం



పూజారి, పూజారమ్మలకు పసుపు నీటి స్నానం చేయిస్తున్న దృశ్యం

రాయగడ: గ్రామదేవత బురదల పోలమ్మ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అత్యంత ప్రధాన ఘట్టమైన పాలధారోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి సేవాయుతులైన పూజారి, పూజారమ్మలు చేతిన అమ్మవారి ఆకారంగా పూజించే కత్తులను పట్టుకుని వీధుల్లో తిరిగారు. దీనినే పాలధారగా పిలుస్తారు. వీధుల్లో తిరిగే సమయంలో పట్టణ ప్రజలు అమ్మవారు తమకు చల్లగా చూడాలని కోరుకుంటూ పసుపుతో కలిపిన నీటిని పూజారి, పూజారమ్మలపై వేస్తారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, వర్షాలు కురవాలని అందుకు అమ్మవారికి పసుపు నీటితో స్నానం చేయించి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తే ఆ తల్లి చల్లని కృప అందిరిపై ఉంటుందన్నది అనాదిగా వస్తున్న ఆచారం. ఈ ఘట్టాన్ని సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఈ సమయంలో పిల్లలు కూడా వేపకొమ్మలు పట్టుకుని సందడి చేశారు.

పాలధారోత్సవంలో చిన్నారుల సందడి



క్లుప్తంగా

పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ మృతి


బత్తాల పకీరు నాయుడు (ఫైల్)

గరుగుబిల్లి: మండలంలోని వల్లరిగుడబ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ బత్తాల పకీరునాయుడు అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. ఈయన భార్య లక్ష్మి వైస్ ఎంపీపీగా వ్యవహరిస్తున్నారు. కొద్ది రోజులుగా పకీరునాయుడు అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూశారు. ఈయన మృతి పట్ల ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, తదితరులు సంతాపం తెలిపారు.

తూర్పుకాపు సామాజిక వేదిక నూతన కమిటీ ఎన్నిక

విజయనగరం ఫూల్‌బాగ్: స్థానిక కామాక్షినగర్ లోని తూర్పుకాపు సామాజిక భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో తూర్పుకా పు సామాజిక వేదిక నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా అంబళ్ల అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఆర్లె కృష్ణారావు, కోశాధికారిగా పత్తిగుళ్ళ రామారావు, లీగల్ అడ్వైజర్స్‌గా వై.పరుశురాం, చందక చిన్న ప్రభాకర్, జాయింట్ సెక్రటరీగా కోట్ల మూర్తి, కోరాడ సత్యం, గౌరవాధ్యక్షులుగా కడగల ఆనంద్, పతివాడ అప్పలనారాయణ, గొర్లె వెంకటరమణ, మెంబర్స్‌గా మహంతి వెంకటరమణ, మీసాల నాగేశ్వరరావు, మంతి ని రమేష్, తాడ్డి ప్రసాద్, కొట్యాడ శ్రీను, చెల్లూ రి రమణ, పెదమజ్జి సత్యనారాయణ ఎన్నికయ్యారు. రొంగలి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్నికల అధికారులుగా బోద రామకృష్ణ, పతివాడ సన్నిబాబు వ్యవహ రించారు. మజ్జి అప్పారావును రాష్ట్రస్థాయి కార్యవర్గానికి ఎంపిక చేస్తున్నట్టు సమావేశంలో తీర్మానించారు.

స్వచ్ఛంద సేవలకు గుర్తింపు

- గుమ్మలూరి విశాలాక్షికి అంతర్జాతీయ పురస్కారం


అంతర్జాతీయ అవార్డును అందుకుంటున్న గుమ్మలూరి విశాలాక్షి

విజయనగరం టౌన్: 'నా ఊరు విజయనగరం' స్వచ్ఛంద సంస్థ అందించిన సేవలకు గుర్తింపు లభించింది. బ్రిటీష్ పార్లమెంట్ ఏటా ఇచ్చే లండన్ ఇంటర్నేషనల్ సమ్మిట్ అవార్డు సంస్థను వరించింది. ఈ నెల 21న లండన్‌లోని హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఎర్త్‌గార్డ్ ఎక్సలెన్స్ అవార్డును సంస్థ వ్యవస్థాపకురాలు గుమ్మలూరి విశాలాక్షి అందుకున్నారు. ఈ విషయాన్ని ఆమె ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. లండన్ పూర్వ మంత్రి పాల్‌స్కల్లీ, జనరల్ సెక్రటరీ కె.సి.త్యాగి తదితరుల చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నట్టు పేర్కొన్నారు.

మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులు

- మూడుసార్లు లోతు దుక్కులు చేపట్టాలి
- మొక్క వయస్సును బట్టి పోషకాలు అందించాలి
- చనిపోయిన చెట్ల స్థానంలో కొత్త అంట్లు వేయాలి
- ఏజెన్సీ కలబోసి ఉన్న జిల్లాలో 4,878 హెక్టార్లో మామిడి సేద్యం


కోత అనంతరం తోటలో లోతు దుక్కు చేపడుతున్న రైతు


తమ్మినేని అమరేశ్వరి

పాలకొండ రూరల్: మామిడి పంట ముగింపు దశకు వచ్చింది. ఇప్పటికే దాదాపు అన్ని తోటల్లో ఫలసాయం పూర్తిగా కోశారు. మిగిలిన తోటల్లో మరికొన్ని రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. మామిడి కోత అనంతరం తోటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై ఉద్యానశాఖ అధికారి తమ్మినేని అమరేశ్వరి పలు విషయాలు వెల్లడించారు. మామిడితోటల్లో కాపు పూర్తయిన తర్వాత తొలకరి వర్షాలకు జూన్, జులై నెలల్లో మొదటిసారి.. ఆగస్టులో రెండోసారి.. అక్టోబర్–నవంబర్ నెలల్లో మూడోసారి భూమిలో పదును చూసుకుని దుక్కి చేసుకోవాలి. మొదటి దుక్కికి వర్షపు నీరు భూమిలోకి బాగా ఇంకిపోయి నేలకోతను అడ్డుకుంటుంది. రెండో దుక్కు కలుపు నివారణకు దోహదపడుతుంది. మూడో దుక్కు పూత రావడానికి దోహదపడుతుంది. నేలలో ఉండే పిండి పురుగులు, పండు ఈగల కోశస్థ దశలు నశిస్తాయి. దుక్కు సాలుకు అడ్డంగా దున్నాలి. తోటలో భూమి వాలును బట్టి ప్రతి 10–15 చెట్లకు చుట్టూ పెద్ద అడ్డ కట్టలు, తోటచుట్టూ గట్లు వేయాలి. దీనివల్ల వర్షపు నీరు, సహజ సత్తువ బయటకు కొట్టుకుపోదు. నేలలో తేమ బాగా ఉంటుంది.

సూక్ష్మ ధాతువులను అందించాలి..

మామిడి తోటలో పలురకాల సూక్ష్మ ధాతు లోపాలు కనిపిస్తుంటాయి. కాయలు కోయడం పూర్తయిన వెంటనే చెట్లు పుంజుకోవడానికి జింక్ సల్ఫేట్ 5 గ్రాములు, యూరియా 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆ తర్వాత సూక్ష్మ ధాతువులైన జింక్, మెగ్నీషియం, ఇనుము, బోరాన్, మాంగనీస్ మిశ్రమ ద్రావణాన్ని తయారు చేసి జూలై, ఆగస్టు నెలల్లో చెట్లు కొత్త ఆకు తొడిగే సమయంలో రెండవసారి పిచికారీ చేయాలి. జింక్ 5 గ్రాములు, మెగ్నీషియం 2 గ్రాములు, మాంగనీస్ సల్ఫేట్ 2 గ్రాములు, ఫెర్రస్ సల్ఫేట్ 2 గ్రాములు, బోరాన్ 2 గ్రాములు, సున్నం 6 గ్రాములు, యూరియా పది గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కొత్తగా అంట్లు నాటాలి....

యాజమాన్య పద్ధతులు అనుసరించని తోటల్లో అక్కడక్కడ చెట్లు చనిపోయి ఖాళీలు ఏర్పడతాయి. ఈ ఖాళీల్లో మొక్క పెట్టేచోట మళ్లీ ఒక మీటరు పొడవు, మీటరు వెడల్పు, మీటరు లోతు సైజులో గుంతలు తీయాలి. గుంతలు తవ్వేటప్పుడు పై అర మీటరు లోతు మట్టిని ఒక పక్కకు.. లోపలి అర మీటరు మట్టిని మరోవైపు వేర్వేరుగా కుప్పలు వేయాలి. పై మట్టికి 100 కిలోల చివికిన పశువుల ఎరువు లేదా 30 కిలోల వర్మీకంపోస్టు, 2 కిలోల సూపర్ ఫాస్ఫేట్ కలపాలి. చెదలు ఆశించకుండా 100 గ్రాముల లిండేన్/ఫాలిడాన్ (5 శాతం) పొడి మందును మట్టి, ఎరువు మిశ్రమానికి కలపాలి. గుంతను మొదట ఈ మిశ్రమంతో నింపాలి. తక్కువైతే పక్కనున్న మట్టితో గుంత నింపుకుని మొక్క నాటే ముందు రోజు గుంటకు నీరు పెడితే పోత మన్ను బాగా కుంగుతుంది. గుంత మధ్య భాగంలో కొంచెం మట్టిని తీసి, అంటు వేర్లకున్న మట్టి కదలకుండా, రాలకుండా ముద్దలా ఉంచి మరికొంత మట్టిని చేర్చి కాంప్యాక్ట్ చేయాలి. మట్టి వదులుగా ఉండరాదు. మొక్క చుట్టూ పల్లెం చేసి నీరు పోయాలి. నాటేటప్పుడు మామిడి అంటు కలయిక భూమిలో పూడ్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నాటిన అంట్లు గాలుల తీవ్రతకు ఊగిపోకుండా మొక్కకు ఇరువైపులా చిన్న కర్రలు కట్టాలి. నాటిన తర్వాత మొక్క కాండం నిటారుగా ఉండాలి. మొక్క చుట్టూ పాదులో నెలకొకసారి నేలను తవ్వి గుల్లపరుస్తూ ఉండాలి. కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసివేస్తుండాలి. తోటల్లో చెట్ల మధ్య ఖాళీ స్థలం దున్నడం వల్ల నేల గుల్లబారి భౌతిక స్థితి మెరుగుపడుతుంది. నేలలో గాలి బాగా ప్రసరించి మొక్కకు మేలు చేస్తుంది. కలుపు మొక్కల బెడద ఉండదు. నీటికి, పోషకాల వినియోగానికి పోటీ ఉండదు. అంతేగాక నేలలోనే నివసించే హానికర పురుగులు నశిస్తాయి.


ఈ తరహా మామిడి తోటలకు కోతల అనంతరం యాజమాన్య చర్యలు అవసరం

సమగ్ర ఎరువుల యాజమాన్యం......

- ముఖ్యంగా నత్రజని, భాస్వరం, పొటాష్ పోషకాల్ని సకాలంలో అధికారుల సూచనల మేరకు అవసరమైన మోతాదులో వేయాలి. వయసును బట్టి ఒక్కో చెట్టుకు ఒక సంవత్సరానికి ఏయే ఎరువులు ఎంత మోతాదులో వేయాలో క్షుణ్ణంగా తెలుసుకోవాలి.
- సంవత్సరం వయసు చెట్లకు పశువుల ఎరువు లేదంటే కంపోస్టు 10 కిలోలు, యూరియా 200 గ్రాములు, సూపర్ ఫాస్ఫేట్‌కు 500 గ్రాములు, ఎంఓపీ 150 గ్రాముల వంతున వేసుకోవాలి.
- రెండేళ్ల చెట్లకు ఒక్కోదానికి పశువుల ఎరువు 20 కిలోలు, యూరియా 400 గ్రాములు, సూపర్ ఫాస్ఫేట్ 1000 గ్రాములు, ఎంఓపీ 300 గ్రాములు వాడాలి.
- ఐదేళ్ల వయసు చెట్లకు పశువుల ఎరువు 50 కిలోలు, యూరియా 1000 గ్రాములు, సూపర్ ఫాస్ఫేట్ 2,500 గ్రాములు, ఎంఓపీ 750 గ్రాములు వేయాలి.
- పదేళ్లు ఆపైన వయసున్న చెట్లకు ఒక్కోదానికి పశువుల ఎరువు 1000 గ్రాములు, యూరియా 2000 గ్రాములు, సూపర్ ఫాస్ఫేటు 500 గ్రాములు, ఎంఓపీ 1,500 గ్రాములు వేయాలి. ఈ ఎరువులు ఎరువులను జులై, ఆగస్టు నెలల్లో చెట్టు పాదులో సమానంగా చల్లి నేలలో కలిసేటట్లు చూడాలి..

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


క్రీడా జ్యోతి వెలిగించి ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు

- నగరంలో ఒలింపిక్ డే రన్
- క్రీడాజ్యోతి వెలిగించి రన్ ప్రారంభించిన ఒలింపిక్ అసోసియేసన్ ప్రతినిధులు

విజయనగరం: అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్ ఆదివారం ఉత్సాహంగా జరిగింది. స్థానిక ఆర్‌అండ్‌బీ జంక్షన్ నుంచి ప్రారంభమైన రన్ ఎత్తుబ్రిడ్జి మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు సాగింది. రన్‌లో పెద్ద ఎత్తున యువత, క్రీడాకారులు పాల్గొనగా.... పాల్గొన్న వారికి నిర్వాహకులు టీ షర్టులు, టోపీలు అందజేశారు. అంతకుముందు ఒలింపిక్ జ్యోతిని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు వెలిగించి, అనంతరం జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడాకారులలో క్రీడాస్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతో ఒలింపిక్ డే రన్ నిర్వహించినట్లు తెలిపారు. విజయనగరం జిల్లా రాష్ట్ర స్థాయిలో ముందువరుసలో ఉండేవిధంగా క్రీడలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రతిఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.


రన్‌లో భాగంగా స్కేటింగ్ చేస్తున్న చిన్నారులు

జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. గ్రామస్థాయి నుంచే వివిధ విభాగాల్లో మంచి ప్రతిభ కనబరచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సత్య డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ సాయిదేవమణి, గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లు నరేంద్ర , ఒలింపిక్ సంఘ సభ్యులు భగవాన్‌దాస్, మల్లేశ్వరరావు, రమణ, శ్రీనివాస్, లీల, ఎన్‌సీపీ, స్కేటింగ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత ప్రచారం


మొయిదలో అవగాహన కల్పిస్తున్న జిల్లా కమిటీ సభ్యులు

నెల్లిమర్ల రూరల్: జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని మొయిద, పూతికపేట, కొండగుంపాం గ్రామాల్లో ఆదివారం త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని నిర్వహించారు. త్రైత సిద్ధాంతం–ప్రభోద సేవా సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు ఆయా గ్రామాల్లో పర్యటించి భగవద్గీతపై ప్రజలకు అవగాహన కల్పించారు. త్రైత సిద్ధాంత భగవద్గీతలోని అంశాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవడంతో పాటు వాటిని అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శంకరరావు, ప్రసాద్, రాజప్పడు, ఆదినారాయణ, జయలక్ష్మి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి

నెల్లిమర్ల రూరల్: సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేద్దామని ఆర్‌డబ్ల్యూఎస్, సీపీడబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు శ్రీరాములు, కృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని రామతీర్థం కల్యాణ మండపం ఆవరణలో యూనియన్ 4వ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. నెలల తరబడి ఉన్న జీతాల బకాయిలపై సమావేశంలో చర్చించారు. గడిచిన ఏడేళ్ల నుంచి కార్మికుల జీతాలు పెంచని విషయంపై ప్రస్తావించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

అభయాంజనేయునికి నృత్యనీరాజనం


ప్రశంస పత్రాలను అందుకున్న చిన్నారులతో ఆలయ కమిటీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: స్థానిక కామాక్షీనగర్‌కి చెందిన శ్రీసూర్య నృత్య అకాడమీ విద్యార్థులు రామనారాయణంలోని అభయాంజనేయునికి నృత్యనీరాజనం సమర్పించారు. అకాడమీ వ్యవస్థాపకులు రామ్ కాశ్యప్ ఆధ్వర్యంలో ఐశ్వర్యజ్యోతి బృందం అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. నృత్యప్రదర్శనలో చిన్నారులు యశస్విని, సంజన, అక్షిత, వర్షిత, జనని, సునంద, భూమి, ఆద్యా, లాస్యశ్రీ, సంజన, నేహశ్రీలు పాల్గొని స్వామివారి కరుణకటాక్షాలకు పాత్రులయ్యారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు చిన్నారులకు ప్రశంస పత్రాలను, జ్ఞాపికలను అందజేశారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

విజయనగరం టౌన్: ఆపదలో ఉన్నవారికి అత్యంత అవసరమైన రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని కన్స్యూమర్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. మాతృభూమి సేవా సంస్థ అధ్యక్షుడు ఇప్పలవలస గోపి పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని ఎన్‌పీఎన్ రక్తనిధి కేంద్రంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం పట్ల ప్రజలు అపోహలు విడనాడాలన్నారు. రక్తదానం చేసిన వ్యక్తి చురుకుగా, ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. రక్తదానం చేసిన దాతలను లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు భీశెట్టి బాబ్జీ సత్కరించారు. శిబిరంలో 50 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వికాస్, అజయ్, కాంచన, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

సేద్యంలో అలుపెరుగని కర్షకుడు

రామభద్రపురంలో ఉల్లి విత్తనాలు విత్తడానికి తన పొలంను సిద్ధం చేస్తున్న కోట రామన్న




పొలం పనులకు వెళ్తున్న మహిళలు

రామభద్రపురం: సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు 62 ఏళ్లు నిండిన వెంటనే పనిచేయలేరన్న ఉద్దేశంతో ప్రభు త్వం రిటైర్మెంట్ ఇస్తుంది. ఉద్యోగులు కూడా వయ సు మీరుతున్న కొద్దీ ఎప్పుడు ఉద్యోగ విరమణ పొందుతామా? ఇంటి వద్ద హాయిగా విశ్రాంతి తీసుకుంటామా? అని ఎదురుచూస్తారు. రైతులు మాత్రం ఆరుపదులు వయసు దాటినా, వృద్ధాప్య ంలోకి వచ్చామన్న ఆలోచనను దరిచేరనీయడం లేదు. ఆలుమగలు కలిసికట్టుగా ఉదయం నుంచి పొద్దుపోయేవరకు పుడమితల్లి సేవలో తరిస్తున్నా రు. పాడి పంటలు పండిస్తూ కుటుంబానికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఈ వయసులో ఎందుకు కష్టపడడమని ఎవరైనా ఉచిత సలహా ఇస్తే... వ్యవ సాయం ఓ వ్యాపకమని, అదే ఆరోగ్యకర జీవనయానమని చెబుతున్నారు.

శక్తి మేర పనిలోనే సంతృప్తి...

రైతులు ఉన్న కొద్ది పాటి పొలంలో వరితోపాటు మొక్కజొన్న, వంగ, చిక్కుడు, బీర, టమాటో, కాకర, బెండ తదితర కూరగాయ పంటలు సాగు చేస్తూ వృద్ధాప్యంలోనూ కుటుంబ పోషణకు సహాయపడుతున్నారు. తక్కువ భూమి ఉన్న వారు కూలీలు అవసరం లేకుండా భార్య పిల్లలతో కలిసి సాగుపనులు చక్కబెడుతున్నారు. ఎక్కువ భూమి ఉన్న రైతులు వరి నాట్లు వేయడం, వేరుశనగ, పత్తి, మొక్కజొన్న, కూరగాయ పంటలు విత్తడం, కలుపుతీయడం, పంట కోయడం పనులను కూలీలతో చేయిస్తున్నారు. మరోవైపు పాడిపరిశ్రమతో పరోక్షంగా ఆదాయం ఆర్జిస్తున్నారు. వ్యవ'సాయం'లోనే ఆనంద జీవితం ఉందంటూ ముందుకు'సాగు'తున్నారు. పిల్లలకు సైతం సాగుపద్ధతులను నేర్పిస్తున్నారు.


రామభద్రపురం పాలసొసైటీలో పాలు పోస్తున్న వృద్ధులు

పనులు చేస్తేనే ఆరోగ్యం



మా అమ్మానాన్నల నుంచే వ్యవసాయ పనులు నేర్చుకున్నాను. నాకు సుమారు 65 ఏళ్లు ఉంటాయి. రోజూ పొలంలోకి వచ్చి ఏదో ఒక పని చేస్తేనే ఆరోగ్యంగా ఉంటుంది. ఇంటి వద్ద ఖాళీగా కూర్చొని ఉంటే అనారోగ్యం పాలవుతాం. మా పొలంలో పని ఉంటే చేస్తాను. లేదంటే వ్యవసాయ కూలి పనులకు వెళ్తాను. వయసు మీద పడింది.. ఖాళీగా కూర్చోవచ్చు కదా అని తెలిసిన వారు అంటుంటారు. కానీ.. అలా ఉండడం నాకు ఇష్టం ఉండదు. అసలు ఉండలేను.

– చొక్కాపు చినరాములు, రైతు, రామభద్రపురం

జాగ్రత్తలు పాటించాలి



వయసు మీరిన రైతులు వ్యవసాయ పనులు చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అధిక బరువు లు ఎత్తడం , ఎక్కువ సేపు నడవడం చేయకూడదు. అనారోగ్యానికి గురవుతారు. వయసులో ఉన్న ప్పుడు పనులు చేసినట్టు వృద్ధాప్య సమయంలో చేయకూడదు. కీళ్ల నొప్పులు, ఎముకల నొప్పులు వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్ర మాదం ఉంది. కష్టంగా ఉండే పనులు కాకుండా సులభంగా ఉండే పనులు చేస్తే మంచిది.

– దిలీప్‌కుమార్, ప్రభుత్వ వైద్యాధికారి, రామభద్రపురం

బుసలు కొడుతున్న విషసర్పాలు..

- 17 నెలల్లో 1619 మందికి పాముకాటు
- ఇందులో ఆరుగురి మృతి
- జిల్లాలో ప్రారంభమైన వ్యవసాయ పనులు
- రైతులు అప్రమత్తంగా ఉండాలి : వైద్యులు


నాగు పాము

విజయనగరం ఫోర్ట్: గజపతినగరం మండలానికి చెందిన పైడిరాజు అనే వ్యక్తి ఇటీవల పొలానికి వెళ్లాడు. అక్కడ పాముకాటు వేయడంతో కుటుంబ సభ్యులు విజయనగరం ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. జామి మండలం అలమండ గ్రామానికి చెందిన జి.కృష్ణ కొద్ది రోజుల కిందట పొలంలో పనిచేస్తూ పాము కాటుకు గురయ్యాడు. వారం రోజుల పాటు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత కోలుకున్నాడు. వీరిద్దరే కాదు.. జిల్లా వ్యాప్తంగా వందలాది మంది పాము కాటుకు గురవుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఆడపా, దడపా వర్షాలు కురుస్తున్నాయి. మొక్కజొన్న, కూరగాయలు, అరటి, పత్తి, వేరుశనగ, తదితర పంటలు సాగులో ఉన్నాయి. వర్షాకాలంలో విషసర్పాల సంచారం కూడా ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయ పనులు చేసేటప్పుడు, కూరగాయలు కోసేటప్పుడు, పంట పొలాలకు నీరు కట్టేందుకు వెళ్లేటప్పుడు రైతులు జాగ్రత్తగా ఉండాలి. ఈ సమయాల్లోనే ఎక్కువగా పాముకాటుకు గురయ్యే అవకాశం ఉంది.

పంట పొలాల్లోనే ఎక్కువ..

సాధారణంగా నిర్జీవ ప్రదేశాలను ఎక్కువగా ఇష్టపడే పాములు ఆహారం కోసం జనారణ్యంలోకి చొచ్చుకు వస్తున్నాయి. చెత్తా చెదారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, పాడుబడిన భవన శిథిలాలు, పూరి గుడిసెలు, గుబురుగా ఉండే పంటచేలల్లో పాములు ఎక్కువగా నివస్తుంటాయి. ఎలుకలు, కప్పలను ఎక్కువగా ఇష్టపడే పాములు పొలాల్లో రాత్రిపూట సంచరిస్తూ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

17 నెలల్లో 1619 మంది..

2023 జనవరి నెల నుంచి 2024 మే నెలఖారు నాటికి 1619 మంది పాముకాటుకు గురయ్యారు. వీరిలో ఆరుగురు మృతి చెందారు. వైద్య విధాన్ పరిషత్ అధీనంలో ఉన్న ఏడు ఆస్పత్రులు, వైద్యారోగ్యశాఖ పరిధిలో ఉన్న 48 పీహెచ్‌సీలు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఉంది. ఈ ఆస్పత్రులకు పాము కాటు బాధితులు చికిత్స కోసం వస్తుంటారు. వారందరికీ సిబ్బంది చికిత్స చేసి ప్రాణాలు కాపాడుతున్నారు.

అవగాహన ఉండాలి..

గ్రామీణ ప్రాంతాల్లో ఉండే రైతులకు పాములపై కనీస అవగాహన ఉండాలని వైద్యులు అంటున్నారు. కనిపించే పాములన్నీ విషపూరితం కాదు. కట్లపాము, తాచుపాము, రక్తపింజర, నాగుపాము వంటి 15 శాతం పాములతోనే ముప్పు ఉంది. సరైన సమయంలో చికిత్స పొందితే విషసర్పం కరిచినా ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు.

జాగ్రత్తలు తప్పనిసరి..

రాత్రి వేళ పొలాలకు వెళ్లేటప్పుడు చెప్పులు, టార్చి లైట్లతో పాటు శబ్దం చేసే పరికరాలు వెంట తీసుకుని వెళ్లడం మంచిది. పాముకాటుకు గురైన వారు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. తీవ్ర ఒత్తిడికి గురైతే బీపీ పెరగడంతో పాటు గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. పసర వైద్యం, మంత్రాలు అంటూ అలసత్వం వహిస్తే ప్రాణాలకే ప్రమాదం. పాము కాటు వేయగానే పైభాగంలో గుడ్డతో కట్టాలి. కాటు వేసిన భాగాన్ని కొత్త బ్లేడుతో గాటు రక్తాన్ని లాగేయాలి. వెంటనే సమీప ఆస్పత్రికి తీసుకెళ్లి కరిచిన పాము వివరాలు చెబితే వ్యాక్సిన్ వేస్తారు.

ఆందోళన తగదు..



పాము కాటువేస్తే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అప్రమత్తంగా ఉంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోను యాంటీ వీనమ్ మందు అందుబాటులో ఉంది. రైతులు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. పాముకాటు వేసిన వెంటనే వీలైనంత తొందరగా ఆస్పత్రికి తీసుకురావాలి.

– డాక్టర్ బోళం పద్మావతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

2023 జనవరి నుంచి 2024 మే నెలఖారు నాటికి పాముకాటుకు గురైన వారి వివరాలు

నెల	పాముకాటుకు గురైన వారిసంఖ్య
జనవరి	56
ఫిబ్రవరి	44
మార్చి	39
ఏప్రిల్	65
మే	109
జూన్	105
జులై	166
ఆగస్టు	234
సెప్టెంబర్	166
అక్టోబర్	128
నవంబర్	115
డిసెంబర్	66
జనవరి (2024)	76
ఫిబ్రవరి	54
మార్చి	59
ఏప్రిల్	68
మే	69